రాగి సాగుకు ప్రోత్సాహం

- మద్దతు ధర క్వింటా రూ.3,846
- ఆర్బీకేల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనుగోలు
- జిల్లాలో 3,237 ఎకరాల్లో రాగి పంట సాగు



కల్లుమర్రి వద్ద కోతకు వచ్చిన రాగి పంట

మడకశిరరూరల్: నీటి సౌకర్యం తక్కువగా ఉండి పెట్టుబడులు పెట్టి సేద్యం చేయలేని రైతులకు రాగి పంట కల్పతరువుగా మారింది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశం ఉండటంతో జిల్లాలో రాగి పంట సాగు చేసే అన్నదాతల సంఖ్య పెరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా రాగి పంట సాగును ప్రోత్సహిస్తుండటంతో వ్యవసాయ, డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏ అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. క్వింటాల్‌కు రూ.3,846 మద్దతు ధరతో ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తుండటంతో ఎక్కువ మంది రైతులు రాగి వైపు దృష్టిసారించారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

సంపూర్ణ ఆరోగ్యం అందించే చిరుధాన్యాల పంటైన రాగి పంట సాగుకు రైతులు ఆసక్తి పెంచుకుని పంటను సాగు చేస్తున్నారు. పంట సాగుకు అయ్యే పెట్టుబడి కూడా తక్కువగా ఉండటం, ఆదాయం ఎక్కువగా ఉండటంతో జిల్లాలోని మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలో రైతులు 3,237ఎకరాలకు పైగా రాగి పంటను బోరు బావులు, చెరువుల కింద సాగు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మడకశిర మండలంలోని చెరువులకు నాలుగేళ్ల నుంచి కృష్ణాజలాలు నింపడంతో బోరు బావుల్లో నీటి మట్టం పెరగడంతో రైతులు రాగి పంట సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

తెగుళ్ల వ్యాప్తి తక్కువ

రాగి పంటకు తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో కూడా రాగికి డిమాండ్ ఉండడంతో పంట సాగు చేసిన రైతులకు ఆదాయం కూడా బాగుంటోంది. తక్కువ నీటితోనే పంటను సాగు చేయవచ్చు. రాగి పైరు భూమిలోకి నాటిన మూడు నెలల్లోపు పంట చేతికి అందుతుంది. ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు కలుపు ఏరివేత, ఎరువులకు కలిపి రూ.15 వేలు ఖర్చు అవుతుంది. పంట కాలం పూర్తయితే ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టిన ఖర్చు పోనూ రైతుకు ఎకరాకు రూ.26 వేలకు పైగా ఆదాయం పొందుతారు.

అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

రాగి పంట సాగును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతు పండించిన రాగికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3,846 మద్దతు కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టింది. సీజన్ ప్రారంభంలోనే ఆర్బీకేల ద్వారా సబ్సిడీతో రాగి విత్తనాలు సరఫరా చేస్తుండటంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పాయి. వ్యవసాయశాఖ పరిధిలోని ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పంట సాగుపై రైతులు అవగాహన కల్పించి బోరు బావుల కింద ఎక్కువ విస్తీర్ణంలో పంటను సాగు చేసే విధంగా చైతన్యం తీసుకుస్తున్నారు.

పుష్కలంగా పోషకాలు

రాగిలో కొలెస్ట్రాల్, సోడియం ఎక్కువగా ఉండవు. కొవ్వు (ఫాట్) శాతం తక్కువగా ఉంటుంది. రాగుల్లో ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, కార్బోహైడ్రేట్లు వంటివి ఎక్కువగా ఉంటాయి. రాగిని ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు అధిక బరువు సమస్య కూడా తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. రాగిని ఆహారం తీసుకోవడం ద్వారా చక్కెర (షుగర్) వ్యాధితో పాటు పలు వ్యాధుల నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. రాగులు తీసుకోవడం ద్వారా గుండెపోటు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్లే రాగిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ రాగి ముద్ద, రాగి జావ రూపంలో ఎక్కువగా తీసుకుంటున్నారు.

లాభదాయకంగా ఉంది



చిరుధాన్యాల్లో ఒకటైన రాగి పంట సాగు రైతుకు లాభదాయకంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగి పంటను ప్రోత్సహిస్తుండడంతో బోరు బావి కింద రూ.25 వేల పెట్టుబడి పెట్టి రబీలో ఒకటిన్నర ఎకరాలో రబీలో సాగు చేశాను. పంట కూడా ఆశాజనకంగా ఉంది. 25 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వారం లోపు పంటను కోస్తున్నాం. పంట సాగుకు పెట్టిన ఖర్చులు పోనూ రూ.70 వేలు ఆదాయం వస్తుందని అంచనా వేశాను.

– నారాయణగౌడ్, కల్లుమర్రి, మడకశిర మండలం

మూడేళ్లుగా రాగి సాగు



పంట సాగుకు విద్యుత్, నీటి సమస్య లేక పోవడంతో పాటు బోరులో నీరు సమృద్ధిగా వస్తుండడంతో రబీలో రెండు ఎకరాల్లో రాగి పంట సాగు చేశాను. 27 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ప్రోత్సాహంతో మూడేళ్ల నుంచి రాగి పంటను సాగు చేసి మంచి దిగుబడి పొందుతున్నా. పంట సాగుకు పెట్టిన ఖర్చులు పోనూ ఈరబీలో ఎకరాకు రూ.25 వేలకు పైగా ఆదాయం పొందాను.

– శ్రీరామరెడ్డి, రైతు, ఎల్లోటి మడకశిర మండలం

రైతులను ప్రోత్సహిస్తున్నాం



మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లో ఇప్పటికే 1,249 ఎకరాల్లో రైతులు రాగి పంటను సాగు మంచి దిగుబడులు పొందుతున్నారు. చిరుధాన్యాల పంటల సాగుపై ఆర్బీకేల పరిధిలోని రైతులకు అవగాహన కల్పించి రాగి పంట సాగును ప్రోత్సహిస్తున్నాం. రాగిలో లాభాలు కూడా బాగా ఉండటంలో రైతులు ఈ పంటను సాగు చేసి ఆదాయం పొందుతున్నారు.

– కృష్ణమీనన్, ఏడీఏ వ్యవసాయశాఖ, మడకశిర

క్లుప్తంగా

కరాటే మాస్టర్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కరాటే మాస్టర్ రామచంద్ర

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కరాటే గ్రాండ్ మాస్టర్ రామచంద్ర ఇండియన్ టాలెంట్ ఐకాన్ నేషనల్ అవార్డు–2024ను అందుకున్నారు. తెలంగాణ ఆర్ట్స్ కల్చరల్, విఘ్నేశ్వర ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో కరాటేలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగానే హిందూపురం పట్టణానికి చెందిన గ్రాండ్ మాస్టర్ రామచంద్ర, కరాటే విద్యార్థులు లోహిత్, హరిణిసాయిలకు అవార్డులను ఆర్గనైజర్ శ్రీధర్ నాని, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. అవార్డు అందుకున్న విద్యార్థులను కరాటే మాస్టర్‌తో పాటు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

ఎస్‌ఐగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



రొళ్ల: ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వుల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా రాజశేఖర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రెగ్యులర్ ఎస్‌ఐగా పని చేస్తున్న మధురామ చంద్రుడు అవినీతి ఆరోపణల నేపథ్యంలో పుట్టపర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అక్కడగా ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ.... గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెడతామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్నందున సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచామన్నారు. నిషేధిక వస్తువులు అక్రమంగా రవాణా చేయడం వంటి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జమేదార్ రామలింగప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం చిగతుర్పి సర్పంచ్ హనుమంతరాయప్ప కుమార్తె నందిని వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీటీసీ సభ్యుడు పాతలింగప్ప తదితరులున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని కోమరేపల్లి గొల్లహట్టిలో సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ నింగమ్మ తాగునీటి సమస్యను పరిష్కరించారు. కోమరేపల్లి గొల్లహట్టిలో ప్రజలు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే నూతన పైప్‌లైన్ వేసినట్లు చెప్పారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల వితరణ



వీల్‌చైర్లు అందుకున్న దివ్యాంగులు

పావగడ: స్థానిక స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం, కర్ణాటక దక్షిణ ప్రాంతం సంక్షేమ సంఘం, ఏపీడీ సంస్థ బెంగళూరు ఆధ్వర్యంలో 61 మంది దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. స్థానిక స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వితరణ కార్యక్రమంలో స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కేఎన్ సుధీంద్ర కుమార్ మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా దివ్యాంగుల పునరావాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీల్‌చైర్లు అందుకున్న దివ్యాంగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌కే రంగ మందిరం అధ్యక్షుడు ఆనందరావు, ఎస్‌సీ నాగభూషణ, తదితర దివ్యాంగుల సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాదులు వాల్మీకి శ్రీనాములు, శివశర్మ తదితరులు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఉషశ్రీచరణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్‌సెల్ జాయింట్ సెక్రటరీ, పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు నాగిరెడ్డి, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ గెలుపుపై మంత్రి.. న్యాయవాదులతో చర్చించారు.

పాత్రికేయుడి కుటుంబానికి ఆర్థికసాయం



సిద్దూ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న నవీన్‌నిశ్చల్

హిందూపురం: పట్టణానికి చెందిన పాత్రికేయుడు సిద్దూ కుటుంబ సభ్యులను ఏపీ ఆగ్రోస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌నిశ్చల్ ఆదివారం వారి ఇంటికెళ్లి పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో రిపోర్టర్ సిద్దూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిసాయం అందించారు. ఇంటి స్థలంతో పాటు పిల్లల చదువుకు అండగా ఉంటామన్నారు.వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఇర్షద్ అహ్మద్, ముస్తక్, అయుబ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌నిశ్చల్‌కు శుభాకాంక్షలు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన బి.నవీన్‌నిశ్చల్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి.. నవీన్‌నిశ్చల్‌ను ఆయన కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేద్దామన్నారు. హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి దీపికలను గెలిపించి జగనన్నకు బహుమతిగా అందిద్దామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసిన వేణురెడ్డి

లేపాక్షి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్.దీపిక భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి మండలంలోని బిసలమానేపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్ర, నాయకులు ద్వారకనాథరెడ్డి, రామాంజిలను ఆదివారం కలిశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ ఓంకారనాయక్

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలను అందించినట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు తెలిపారు. చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీల వ్యాధి నిపుణులు జ్యోతివిజయ కుమార్ వంద మంది స్త్రీ రోగులను పరీక్షించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే రూ.30 వేలు విలువ చేసే మందులను అందజేశారు. పావగడ నుంచి వచ్చిన డాక్టర్ ఓంకార నాయక్ 50 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. హిందూపురం నుంచి వచ్చిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ జింకా కృష్ణమోహన్ 100 మంది కంటి రోగులను పరీక్షించి 50 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

సోమందేపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో ఆయన పర్యటించారు. వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను సిబ్బందితో తొలగింపజేశారు. అనంతరం వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు దగ్గరుండి ముసుగు వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజనాదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని బెంగళూరు రోడ్డులో శ్రీచైతన్య పాఠశాల వద్ద సామాజిక సేవకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్ జూలియట్ మిత్ర బృందం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించి.. మజ్జిగ ప్యాకెట్లు, జ్యూస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, లోకేష్, అబ్రహం, సుమన్, శ్యామ్ బాబు, జుబేర్, శివ, చందన్, హనూక్, పండు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కూసినా...

పెనుకొండరూరల్ : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కొన్నిచోట్ల రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలు, ఫొటోలు కనిపిస్తూనే ఉన్నాయి. పెనుకొండ మండలం అడదాకులపల్లి, మావటూరు గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ప్రచారం చేయగా ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు.



హిందూపురం: ఇన్విజిలేటర్లకు ప్రశ్నపత్రాలు ఇవ్వడంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ గంగప్ప



రొళ్ల: సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంఈఓ శ్రీధర్

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సాక్షిబృందం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగానే హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ పాఠశాలల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో ఎంఈఓలు సమావేశమై సూచనలు, సలహాలిచ్చారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టి కృషి



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు



రొళ్ల:మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని కల్లురొప్పం గ్రామంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రభుత్వం గత 58 నెలల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సచివాలయాలను ఏర్పాటు చేసి వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు ఆయన దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన కూడా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజల ఆదరణతో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అదేవిధంగా 175 స్థానాలకు 175 స్థానాలు కైవసం చేసుకుని మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఈరలక్కప్ప

రొళ్ల: మండల కేంద్రం ప్రధాన రోడ్డులోని మసీదులో ఆదివారం సర్పంచ్ రామలక్ష్మమ్మ తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడుతో కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వయంగా అన్నదానం చేశారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ముస్లింలకు ఏ సమస్యలు వచ్చినా వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ శివప్రసాద్, వైఎస్ ఎంపీపీ నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, కాకి వైఎస్ సర్పంచ్ రాజు, సీనియర్ నాయకులు నాగేష్‌రంగారెడ్డి, శశికుమార్, ముద్దారెడ్డి, బసవరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో 482 కర్ణాటక మద్యం ప్యాకెట్లను ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రూకలపల్లికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి పట్టుబడగా మరో ఇద్దరు పరారైనట్లు చెప్పారు. మద్యం ప్యాకెట్లతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు.

పరామర్శ

అగళి: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మజీ సర్పంచ్ రంగనాథప్ప అనారోగ్యంతో బెంగళూరుకు వెళ్లి చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప... రంగనాథప్ప స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచ్ సుజత, ఎంపీపీ భర్త కామరాజు, రావుడి ఎంపీటీసీ భర్త బసవరాజు, నాయకులు చంద్రప్ప, రామన్న , సూర్యనారాయణరెడ్డి, తిప్పేస్వామి తదితరులున్నారు.

మూర్ఛ వ్యాధి శిబిరం

మడకశిర: స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూర్ఛ వ్యాధి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు గోపాలం, శివనారాయణ, నిఖితారెడ్డి తదితరులు 35 మంది మూర్ఛ వ్యాధిగ్రస్తులైన రోగులకు చికిత్స అందించి మందులు అందించారు.

నేత్ర దానం



ఏ.వరలక్ష్మి (ఫైల్)

హిందూపురం: హిందూపురం నేతాజీ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న వరలక్ష్మి (65) గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో ఆమె కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆదివారం మధుగిరి వరదాయిని నేత్ర సంగ్రహణా కేంద్రం నిర్వాహకులు గాయత్రి నారాయణ నేత్రలను సేకరించారు. వరలక్ష్మి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు.

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక చేశారు. ఆదివారం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. మండలం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

'అక్రమాలు తెలియజేయండి'

పావగడ: లోకసభ ఎన్నికలకు సంబంధించి స్థానిక విధాన సభ క్షేత్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని స్థానిక తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అక్రమాలు జరిగినా తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయవాణి 08136-244242 ఫోన్ నంబరుకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

నేడు బూత్ కన్వీనర్లతో సమావేశం

పెనుకొండ: నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లతో సోమవారం మంత్రి ఉషశ్రీచరణ్ సమావేశమవుతారని మంత్రి క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు క్యాంప్ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. వారి నుంచి రూ.3,800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అగళి: మండల కేంద్రంలోని కేజీబీవీలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌ఓ నాగరత్నమ్మ తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో 40 సీట్ల చొప్పున ఉన్నాయన్నారు. 8, 9వ తరగతిలో మూడు సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయని, వచ్చే నెల 11లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనాథ పిల్లలతో పాటు బడిబయట ఉన్న పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్రరేఖకు దిగువ ఉన్న బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా ఆదివారం జీపీ పాళ్యం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రవిశంకర్ వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, పీఓ రాజేష్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.